క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రఘునాథపాలెం: మండలంలోని వీవీపాలెంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ ఏడీ యల్లంపల్లి రమేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు వేసే పనులు కొనసాగడం వల్ల ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏడీ కోరారు.

రేపు ప్రజావాణి

ఖమ్మంఅర్బన్/నేలకొండపల్లి: మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని తహసీల్దార్లు ఇమ్రాన్, సీహెచ్.స్వామిలు పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను దరఖాస్తుల రూపంలో నేరుగా అందించి పరిష్కరించుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పును స్వాగతిస్తున్నాం..

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ స్వాగతిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆవునూరి మధు అన్నారు. శనివారం ఖమ్మంలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను పార్టీ బలపరిచిందన్నారు. ఎస్సీ వర్గీకరణలో ఏ.బీ.సీ.డీలుగా గుర్తించి ప్రత్యేకమైన స్థానాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి మందుల రాజేంద్రప్రసాద్, కోలా లక్ష్మీనారాయణ, బజ్జూరి వెంకట్‌రామిరెడ్డి, వై.ప్రకాశ్, రమేష్, ఐ.వెంకన్న, సుభాన్, వి.వి.రావు, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

'ఎస్‌బీఐటీ' విద్యార్థులకు ప్రశంస



ప్రశంసలు అందుకున్న విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: జేఎన్‌టీయూహెచ్ ఆధ్వర్యాన శనివారం హైదరాబాద్‌లోని క్యాంపస్‌లో బిజినెస్ ఇన్‌క్యుబేటర్(టీబీఐ) నిర్వహించిన స్పార్క్ 1.0 సదస్సులో తమ కళాశాల విద్యార్థులు ప్రశంసలు అందుకున్నారని ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. గత మార్చిలో రాష్ట్రస్థాయిలో విద్యార్థుల నుంచి ఆన్‌లైన్‌లో ఆవిష్కరణలు స్వీకరించగా ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు.అనంతరం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్, అకాడమిక్ డైరెక్టర్లు గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, జె.రవీంద్రబాబు, ప్రిన్సిపాల్ జి.రాజ్‌కుమార్‌లు అభినందించారు.

చర్యలు తీసుకోవాలి

నేలకొండపల్లి: దివ్యాంగుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన స్మిత సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని, లేకుంటే నిరాహార దీక్ష చేస్తానని దివ్యాంగుల జేఏసీ చైర్మన్ పీ.వీ.చలమయ్య హెచ్చరించారు. మండల కేంద్రంలో శనివారం జేఏసీ ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన స్మిత సబర్వాల్ మంగళవారం లోపు బహిరంగ క్షమాపణ చెప్పకుంటే కలెక్టర్ కార్యాలయం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో చిర్రా భిక్షం, రామకృష్ణ, రామారావు, చందర్‌రావు, నాగేశ్వరావు, బాలయ్య, బ్రహ్మం, భాస్కర్‌రావు, పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

వీరయ్య ఆశయ సాధనకు కృషి చేయాలి

ఖమ్మంరూరల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పల్లెగూడెంకు చెందిన చుండూరి వీరయ్య చేసిన పోరాటాలు ఎప్పటికీ కమ్యూనిస్టుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నాయని సీపీఎం మండల కార్యదర్శి నంద్ర ప్రసాద్ అన్నారు. శనివారం పల్లెగూడెంలో జరిగిన వీరయ్య 30వ వర్ధంతిలో ఆయన పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదల సమస్యల పరిష్కారం కోసం ఎంతో పోరాడారని, ఆశయ సాధన కోసం పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు డి.వెంకన్న, వి.నాగేశ్వరరావు, లక్ష్మయ్య, రామయ్య, రామనాథం తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కల్కి
వినోద	శివం భజే
సాయిరాం	బుడ్డి
ఆదిత్య	ఉషా పరియణం
శ్రీనివాస	రాయన్

- ఖమ్మంగాంధీచౌక్

హైమాస్ట్ జిగేల్..!



హైమాస్ట్ లైట్ల వెలుగులతో కళకళలాడుతున్న తాళ్లగూడెం సెంటర్



పొన్నేకల్‌లో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లు

మారుమూల గ్రామాల్లోనూ కొత్త వెలుగులు

- రాత్రి వేళ కళకళలాడుతున్న జీపీలు
- రూ.కోటిన్నర నిధులతో 102 లైట్లు ఏర్పాటు



హైమాస్ట్ లైట్లు

సండే స్పెషల్

కామేపల్లి: పట్టణాల్లోని ప్రధాన కూడళ్లలో పరిమితమైన హైమాస్ట్ లైట్లు ఇప్పుడు గ్రామాల్లోనూ కనిపిస్తున్నాయి. ఎస్‌డీఎఫ్ నుంచి సుమారు రూ.కోటిన్నర నిధులతో మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో 102 లైట్లను అమర్చారు. దీంతో రాత్రి వేళ గ్రామాలు కొత్త అందాలను సంతరించుకున్నాయి. ముఖ్యంగా ప్రధాన కూడళ్ల లైట్ల వెలుగులతో జిగేల్ జిగేల్‌గా కనిపిస్తున్నాయి.

102 లైట్లు ఏర్పాటు..

మండలంలోని ప్రధాన సెంటర్లో 102 హైమాస్ట్ లైట్లను నూతనంగా ఏర్పాటు చేశారు. ఒక్కో లైట్ ఏర్పాటుకు రూ.లక్షన్నర ఖర్చు చేయగా.. మొత్తం 102 లైట్లకు సుమారుగా రూ.కోటిన్నర ఖర్చుతో అమర్చారు. అంతేకాక వీటికి సెన్సార్ అమర్చడంతో ఆటోమెటిక్‌గా ఉదయం 6 గంటలకు ఆఫ్ కావడం, సాయంత్రం 6 గంటలకు ఆన్ కావడం జరుగుతోంది.

జీపీలపై అదనపు భారం..

జీపీల్లో నిధులు లేక ఇప్పటికే గ్రామాలకు సంబంధించిన విద్యుత్ బకాయిలు చెల్లించకుండా ఉంటున్నారు. ఇప్పుడు హై మాస్ట్ వెలుగులతో విద్యుత్ వినియోగం పెరిగి విద్యుత్ బిల్లు అధికంగా వచ్చే అవకాశం ఉంది. కాగా, గతంలో పలు గ్రామాల్లో గ్రామస్తుల సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా.. ఏదైనా దొంగతనాలు జరిగిన సందర్భాల్లో వెలుతురు లేక సరిగా గుర్తించలేని పరిస్థితి ఉండేది. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. రాత్రి సమయాల్లోనూ పగలు ఉన్నట్టుగానే కనిపిస్తుండడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాం..



మండలానికి 102 ఐమాస్ట్ లైట్లు రాగా వాటిని ఆయా గ్రామాల్లోని ప్రధాన సెంటర్‌లలో అమర్చాం. అందరికీ ఆహ్లాదకంగా ఉండేటా తీర్చిదిద్దాం. ఇక నుంచి రాత్రి అనే తేడా లేకుండా గ్రామాలు కనిపిస్తాయి.

– రవీందర్, ఎంపీడీఓ, కామేపల్లి

ఎమ్మెల్యే కృషితోనే..



ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య కృషితోనే సుమారు రూ.కోటిన్నరతో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. దీంతో గ్రామాలు విద్యుత్ వెలుగులతో కళకళలాడుతున్నాయి. ఎమ్మెల్యేకు మండల ప్రజలందరి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు.

– గింజల నర్సింహారెడ్డి,కాంగ్రెస్ మండలాధ్యక్షుడు

కేరళ బాధితులను ఆదుకోండి



విరాళాల సేకరణలో పాల్గొన్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రకృతి విపత్తు బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని సీపీఐ ఖమ్మం జిల్లా సమితి ప్రజలకు విజ్ఞప్తి చేసింది. కేరళలోని వాయినాడ్‌లో ప్రకృతి విపత్తు కారణంగా వందలాది మంది ప్రాణాలు కోల్పోగా వేలాది మంది నిరాశ్రయులైన విషయం విధితమే. బాధితులను ఆదుకునేందుకు శనివారం సీపీఐ ఆధ్వర్యాననగరంలో విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్‌లు మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా నుంచి కూడా వాయినాడ్ బాధితులకు ఆర్థిక సాయం అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని, దాతలు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యుడు యర్రా బాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, మహ్మద్ సలాం, సీహెచ్ సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, పగడాల మల్లేష్, రావి శివరామకృష్ణ, జిల్లా సమితి సభ్యులు యానాలి సాంబశివరెడ్డి, ఏనుగు గాంధీ, నూనెశశిధర్, ప్రతానపు రామనాథం, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభం



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ప్రసాద్‌రెడ్డి

నేలకొండపల్లి: మండలంలోని సింగారెడ్డిపాలెం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో పీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను శనివారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు తాగునీటిని అందించేందుకు ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, విద్యార్థులు ఏకాగ్రతతో చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, ఎంపీపీ వజ్జా రమ్య, ఎంపీటీసీ రేగూరి వాసవి, కాంగ్రెస్ నాయకులు శాఖమూరి రమేష్, సీతారాములు, కొర్లకుంట్ల నాగేశ్వరరావు, కుక్కల హనుమంతరావు, భద్రయ్య, కడియాల నరేష్, కొమ్మినేని పుష్పావతి, కె.శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు. అలాగే మోటాపురంలో ఇటీవల మృతి చెందిన సీపీఎం నాయకుడు చావా లెనిన్ సంతాప సభలో ఆయన పాల్గొని నివాళులర్పించారు.

ఫాగింగ్ యంత్రాలను అందుబాటులో ఉంచాలి

నేలకొండపల్లి: ప్రతీ పంచాయతీలలో ఫాగింగ్ యంత్రాలను అందుబాటులో ఉంచాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం స్వచ్ఛదనం.. పచ్చదనంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామాల వారీగా వీధి కుక్కలను గుర్తించి రిపోర్టు అందించాలని, రహదారుల వెంట వ్యర్థాలు వేయకుండా చర్యలు తీసుకోవాలని, షెడ్యూల్ ప్రకారం ఫాగింగ్ చేయాలన్నారు. వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఓ అరుణకుమారి, ఈజీఎస్ ఏపీఓ సునీత, ఐకేపీ ఏపీఎం అశోక్‌రాణి, పంచాయతీ కార్యదర్శులు దేవేందర్, దినేష్, బోళ్ల వీరబాబు, మహేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని మంచికంటి ఫంక్షన్ హాల్‌లో సీపీఎం టూటౌన్ కమిటీ–బీవీకే నెల నెలా ఉచిత మెడికల్ క్యాంపులో భాగంగా శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్తంభాద్రి ఆస్పత్రి వైద్యుడు గట్టినేని సురేష్, సీపీఎం ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రతి నెలా ఉచిత వైద్య క్యాంపు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈమేరకు గుండెకు సంబంధించిన 2డీ ఎకో పరీక్షలను డాక్టర్ పేర్ల హర్షతేజ నిర్వహించగా, వైద్యులు మేదరమెట్ల అనిల్‌కుమార్, గుమ్మడి రాఘవేంద్ర, డొగుపర్తి కృష్ణ సుమంత్, చీకటి భారవి, కొల్లి అనుదీప్, పిల్లలమర్రి సుబ్బారావు, జెట్ల రంగారావు ఆధ్వర్యాన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వై.విక్రమ్, నాయకులు వై.శ్రీనివాసురావు, పి.ఝాన్సీ, వాసిరెడ్డి వీరభద్రం, నర్రా రమేష్, పి.వాసు, అఫ్జల్, అరుణ, పి.కృష్ణారావు, టి.జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సీఎండీకి వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ ప్రతినిధులు

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ కార్మికులు, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం(327) జిల్లా ప్రతినిధులు ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డికి శనివారం విజ్ఞప్తి చేశారు. జిల్లా పర్యటనలో భాగంగా ఖమ్మంకు విచ్చేసిన సీఎండీని యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మందపాటి సత్యనారాయణరెడ్డి, వి.సీతారాంగోపాల్ తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందించి పలు సమస్యలను వివరించారు. అలాగే విద్యుత్ శాఖలో పదోన్నతులు, బదిలీల ప్రక్రియను నిర్వహించాలని, ఆర్టిజన్లకు పదోన్నతి కల్పించాలని, అన్‌మ్యాన్డ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, యాజమాన్యం నేరుగా వేతనాలు చెల్లించాలని, జేఎల్‌ఎం, జూనియర్ అసిస్టెంట్ పోస్టులను కల్పించాలని సీఐటీయూ ప్రతినిధుల బృందం సీఎండీని కోరింది. సబ్ స్టేషన్లలో కార్మికుల, ఉద్యోగుల కొరత తీర్చాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నలువల స్వామి, అధ్యక్షులు ఆంజనేయులు, వెంకటరాజు, కుమార స్వామి, సంఘం ఖమ్మం డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వి.మహేష్, ఖమ్మం రూరల్ డివిజన్ సంఘం ప్రతినిధులు అమీర్, నవీన్, శ్రీను, మంగ్యా, సీఐటీయూ కంపెనీ కార్యదర్శి ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'మమత'లో లేజర్ పద్ధతిలో ఆపరేషన్



ఆపరేషన్ వివరాలు వెల్లడిస్తున్న వైద్యులు, పక్కన హరిసింగ్

ఖమ్మంఅర్బన్: నొప్పి లేకుండా, రక్తబొట్టు కారకుండా క్లిష్టమైన ప్రొస్టేట్ ఆపరేషన్‌ను లేజర్ విధానంలో చేసినట్లు మమత సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామస్వామి వెల్లడించారు. ఆస్పత్రిలో శనివారం ఆయన వైద్యులు శశికుమార్, అనిల్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు. తిరుమలాయపాలెంకు చెందిన బానోత్‌హరిసింగ్ ప్రొస్టేట్ సమస్యతో బాధపడుతూ తమ ఆస్పత్రిలో చేరగా, ఆధునాతన యంత్రాల ద్వారా లేజర్ విధానంలో శస్త్రచికిత్స చేశామని తెలిపారు. ఈ ఆపరేషన్‌కు రూ.2లక్షల వరకు బిల్లు కానుండగా, సదరు వ్యక్తికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేయడమే కాక రెండో రోజే డిశ్చార్జి చేసినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో సూపర్‌స్పెషాలటీ ఇన్‌చార్జ్ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల చెంతకు తమిళనాడు వాసి..



ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

ఖమ్మంఅర్బన్: తమిళనాడు రాష్ట్రం రామనాథపురం జిల్లాకు చెందిన చంద్రన్ గత నెల 22వ తేదీన ఖమ్మం రూరల్ మండలంలోని గూడూరుపాడు గ్రామంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. ఈక్రమంలో గ్రామస్తులు అన్నం ఫౌండేషన్‌కు సమాచారం ఇవ్వగా.. వారు ఆశ్రమానికి తరలించారు. అనంతరం కోలుకున్నాక శనివారం తమ వ్యక్తిగత వివరాలను వెల్లడించాడు. తాను జమ్మూ కశ్మీర్‌లో సీఆర్‌పీఎఫ్‌లో (హెడ్ కానిస్టేబుల్) పని చేస్తున్నానని, తనకు భార్య, కుమారుడు ఉన్నారని చెప్పగా.. ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ఆయన కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చి అప్పగించారు. ఈక్రమంలో ఫౌండేషన్ సభ్యుడు లాలయ్య రూ. 5 వేలను చంద్రన్‌కు చార్జీలు, ఇతర ఖర్చుల నిమిత్తం ఇచ్చారు.

కుటుంబానికి చేయూత

ఖమ్మంఅర్బన్: నగరంలోని దానవాయిగూడెం కాలనీకి చెందిన ఎ.బ్రహ్మచారి ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబానికి బీఆర్‌ఎస్ నాయకుడు దామాల రవి శనివారం రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. నాయకులు నల్లూరి మధుబాబు, రామదాసు, అనబత్తుల వెంకటేశ్వర్లు, మద్దెల ఉపేందర్, నాగటి భిక్షం తదితరులు పాల్గొన్నారు.

నేనే వస్తా.. అన్నీ చేస్తా !

ఖమ్మంమయూరిసెంటర్: ఇటీవల ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి పలువురు అధికారులు బదిలీ అయ్యారు. ఇందులో ఓ అధికారి గతంలోనే దరఖాస్తుల పరిష్కారంపై 'కమిట్‌మెంట్' ఇచ్చినట్లు తెలుస్తోంది. తీరా ఆయన బదిలీ కావడంతో దరఖాస్తుదారులు ప్రశ్నించినట్లు సమాచారం. దీంతో ఆయన పది రోజుల్లో తానే వస్తానని.. అప్పుడు అందరి పనులు పూర్తిచేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిసింది. కార్యాలయంలో తన గది, సీటు, కంప్యూటర్, ఫైళ్లను ఎవరికీ అప్పగించవద్దని సిబ్బందికి సూచించినట్లు ప్రచారం జరుగుతుండడం గమనార్హం.

కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న అల్లిక అంజయ్య

ఖమ్మం మామిళ్లగూడెం: రాబోయే రోజుల్లో కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి దనయాకుల వెంకటనారాయణయాదవ్, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య అన్నారు. శనివారం జిల్లా కార్యాలయంలో జరిగిన టూటౌన్ కార్యవర్గ సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలయ్యేలా ప్రజల తరపున బీజేపీ పోరాడుతుందన్నారు. ఈమేరకు ఎస్సీ వర్గీకరణ అంశం సుప్రీంకోర్టులో తీర్పు అనుకూలంగా రావడంపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి జిల్లెల్ల నాగరాజు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ అధ్యక్షులు తాజ్ నూత్ భద్రం, దొడ్డపల్లి అప్పారావు, పాశం శ్రీనివాస్‌రెడ్డి, రుద్రగాని మాధవ్, దాసరిమధు, సురేష్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

ఖమ్మంగాంధీచౌక్: లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యుడు డాక్టర్ డీపీసీ రావు పుట్టినరోజు సందర్భంగా శనివారం నగరంలోని శ్రీ రామకృష్ణ విద్యాలయం విద్యార్థులకు రూ.5 వేల విలువ చేసే నోట్ పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు, పెన్నులు వితరణ చేశారు. డాక్టర్ డీపీసీ రావు, బొమ్మిడి కిరణ్, నాగబండి కృష్ణమూర్తి, నాళ్ల గోవర్ధన్‌ల ఆర్థిక సాయంతో ఈ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం అధ్యక్షుడు డాక్టర్ బొల్లికొండ శ్రీనివాసరావు, గెల్లా శ్రీరాం, ఆర్తి గోవిందరావు, విశ్వేశ్వరరావు, పాయల నాగేశ్వరరావు, ఎ.గోవర్ధన్‌రావు, వై.శ్రీనివాసరావు, దుర్గాగేశ్వరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: పూలే, అంబేడ్కర్ అధ్యాయన వేదిక ఆధ్వర్యాన ఈ నెల 18న నిర్వహించే సర్వాయి పాపన్న జయంతిని జయప్రదం చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. శనివారం ఖమ్మంలో జరిగిన సమావేశంలో బీఎస్పీ జిల్లా నాయకుడు అల్లిక వెంకటేశ్వరావుయాదవ్ మాట్లాడుతూ.. కులగణన నిర్వహించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ యాదవ సంఘం నాయకులు భారీ మల్సూర్ మాట్లాడుతూ.. ఐదు శాతం లేని అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్ సాధించుకోవటం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు కనుమరుగైపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మందారామారావు, బానోత్ భద్రూనాయక్, శ్రీనివాస్‌గౌడ్, రాంబాబు, విజయ్‌కుమార్, సోమరాజు, లింగబోయిన లక్ష్మణ్, మట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు వెంటనే అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

కామేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం కార్యాలయంలో కిన్నెర రామచంద్రయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ మహిళలకు రూ.2500, వ్యవసాయ కూలీకి ఏడాదికి రూ.12 వేలు, రేషన్ కార్డులు, సన్న బియ్యం ఇవ్వాలని, అర్హులకు రైతు రుణమాఫీతో పాటుగా రైతుబంధు ఇవ్వాలని కోరారు. మండలంలో సీతారామ ప్రాజెక్టు కాల్వ భూ నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లించడంతో పాటు కాల్వ పనులు త్వరగా పూర్తి చేసి సాగు నీరు అందించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకుడు భూక్యా వీరభద్రం, కొండబోయిన నాగేశ్వరరావు, దుగ్గి కృష్ణ, బాదావత్ శ్రీను, నరాటి నాగేశ్వరరావు, సకినాల శ్రీనివాసరావు, కోలా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై విచారణ జరిపించాలి

నేలకొండపల్లి: మండలంలోని అనాసాగారం ప్రభుత్వ చౌక దుకాణం రేషన్ డీలర్ అక్రమాలపై విచారణ జరిపించాలని కాంగ్రెస్ మండల నాయకుడు షేక్ మదార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామంలో చనిపోయిన వారి పేరు మీద కూడా బియ్యం తీసుకుని అమ్ముకుంటున్నాడని ఆరోపించారు. ఇటీవల ఏపీలోని నందిగామకు చెందిన ఓ వ్యాపారికి బియ్యం సరఫరా చేశాడని అందుకు గత నెల 15న గ్రామానికి చెందిన మల్టీ పర్పస్ వర్కర్ ఇంట్లో పోలీసులకు దొరికిన బియ్యమే సాక్షమన్నారు. ఇకనైనా విచారణ చేపట్టి చర్యలు తీసుకోని ఎడల ఆందోళన చేస్తామని హెచ్చరించారు. డీలర్‌పై, సివిల్ సప్లయిస్ అధికారుల తీరుపై మంత్రి శ్రీనివాసరెడ్డికి ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కర్రి నర్సయ్య, బొడ్డు నాగేశ్వరరావు, కృష్ణయ్య, జె.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నాటికల పోటీల బ్రోచర్లు ఆవిష్కరణ

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలో జరగనున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఆహ్వాన నాటికల పోటీల బ్రోచర్‌ను శనివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. నెలనెలా వెన్నెల 7వ వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 9, 10, 11వ తేదీల్లో ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో నాటికల పోటీలు జరగనుండగా నిర్వాహకులు భట్టిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటిక పోటీలను వీక్షించడం ద్వారా కళాకారులను గౌరవించాలని తెలిపారు. కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఖమ్మం కళాపరిషత్ చైర్మన్ డాక్టర్ నాగబత్తిని రవి, నెలనెలా వెన్నెల నిర్వాహకులు ఏ.సుబ్రమణ్యకుమార్, మోటమర్రి జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఖాతాదారులందరూ బీమా కలిగి ఉండాలి



బీమా చెక్కు అందిస్తున్న ఉదయ్

కామేపల్లి: బ్యాంకులోని ప్రతీ ఖాతాదారుడు బీమా కలిగి ఉండాలని ఏపీజీబీవీ రీజినల్ మేనేజర్ ఉదయ్ పేర్కొన్నారు. పండితాపురం ఏపీజీబీవీ బ్యాంకులో సాతానిగూడెం గ్రామానికి చెందిన ఖాతాదారుడు తాలారి వెంకటరత్నం ప్రధానమంత్రి జీవనజ్యోతి పథకం కింద ప్రీమియం చెల్లించి ఇన్సూరెన్స్ బీమాను కలిగి ఉన్నారు. ఇటీవల వెంకటరత్నం అనారోగ్యంతో మృతి చెందగా అతడికి బీమా వర్తించి రూ.2 లక్షల చెక్కు మంజూరు కాగా శుక్రవారం గ్రామంలో జరిగిన సమావేశంలో మృతుడు నామిని భార్య శాంతమ్మకు బ్యాంకు అధికారులు చెక్కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతీ ఖాతాదారుడు పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై బీమాలు చేయించుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ శ్రీనివాస్, ఫీల్డ్ ఆఫీసర్ ప్రకాశ్, నవీన్ బ్యాంకు సిబ్బంది ఉపేంద్రమ్మ, రామనాగయ్య పాల్గొన్నారు.

విద్యా, ఉపాధి రంగాలపై నిర్లక్ష్యం వద్దు



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: సమాజంలో క్రియాశీలకంగా ఉన్న విద్యా, ఉపాధి, వైద్య రంగాలపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదనిపీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పెద్దింటి రామకృష్ణ అన్నారు. శనివారం ఖమ్మంలోని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం విద్యా రంగాన్ని, ప్రజా సమస్యలను గాలికి వదిలేసినట్లుగానే కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్‌లో విద్య, వైద్య, ఉపాధి రంగాలను వదిలేసిందన్నారు. గురుకులాలకు సొంత భవనాల నిర్మించాలని, ఇంటర్, డిగ్రీ కళాశాలల పరిస్థితి అస్తవ్యస్తంగా మారాయని, యూనివర్సిటీలలో కనీసం వైస్ చాన్స్‌లర్, బోధన సిబ్బంది లేరన్నారు. గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్స్ నేటికీ విడుదల చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉన్నదన్నారు. ఈ సమావేశంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.వెంకటేష్, కిరణ్, సతీష్, వినయ్, శశి, కార్తీక్, స్టాలిన్, వంశీ, పృథ్వి తదితరులు పాల్గొన్నారు.

హోమ్ థియేటర్ అప్పగింత

ఖమ్మంక్రైం: నగరంలోని కొత్త బస్టాండ్ అడ్డా–3 వద్ద ఆటో ఎక్కిన ఓ ప్రయాణికుడు తనకు సంబంధించిన హోమ్ థియేటర్‌ను ఆటోలో మర్చిపోయాడు. దీంతో ఆటోడ్రైవర్ శ్రీనివాస్ అలియాస్ కట్టప్ప తన వద్ద ఉంచి ఆ ప్రయాణికుడు తిరిగి రావడంతో అతడికి అందించి తన నిజాయితీని చాటుకున్నారు.